క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగి దుర్మరణం



పైల అప్పారావు (ఫైల్)

గాజువాక: స్థానిక శ్రీనగర్ జంక్షన్‌లో ఆదివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడ్లపూడి నిర్వాసిత కాలనీ అప్పికొండకు చెందిన పైల అప్పారావు (56) విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. వ్యక్తిగత పనుల కోసం శ్రీనగర్ వెళ్లిన ఆయన ఇంటికి చేరుకోవడం కోసం జంక్షన్‌లో వేచి ఉన్నాడు. అదే సమయంలో తనతో పాటు స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్న ప్రసాద్ అనే వ్యక్తి అటు వైపు రావడంతో ఆపి బైక్ ఎక్కించుకున్నాడు. బైక్ ఎక్కిన అప్పారావు జారి పడిపోవడంతో వెనకనే వస్తున్న లారీ అతడి రెండు కాళ్లపైనుంచి వెళ్లిపోయింది. స్థానికుల సహాయంతో అతడిని తొలుత స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్తుండగా మృతి చెందినట్టు సీఐ హుస్సేన్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య సన్యాసమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సన్యాసమ్మ ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి సహకారం



విరాళం అందిస్తున్న దొడ్డి దేముడు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని రామాలయ పునర్నిర్మాణానికి శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం అధ్యక్షుడు దొడ్డి దేముడు రూ.15వేలు అందించారు. గ్రామంలోని పాత రామాలయం స్థానంలో కొత్త ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు విందుల నారాయణరావు, కొలిపాక అప్పారావులకు నగదు అందించారు. కార్యక్రమంలో విందుల చిరురాజు, కరణం సన్ని, గొట్యాడ లోవరాజు, వరహాల పంతులు, నరసింగరావు, కొండలరావు, నరసింహకొండ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత



బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (1998–99బ్యాచ్) ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు.తమతో పాటు చదువుకున్న దిబ్బపాలేనికి చెందిన కంటుముచ్చు కాంతితేజ్ అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. అతని పరిస్థితిని తెలుసుకున్న స్నేహితులు ఆదివారం పరామర్శించారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో సిరిశెట్టి వెంకట శివ అప్పారావు, పిట్టా పైడిరాజు, అండిబోయిన అప్పలరాజు, పెదపూడి వాసు, ఉరుము నానాజీ తదితర మిత్ర బృందం పాల్గొన్నారు.

తెన్నేటికి ఘన నివాళి



తెన్నేటి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వరలక్ష్మి తదితరులు

ఉక్కునగరం: ఉక్కు ఉద్యమ నాయకుడు, మాజీ ఎంపీ, మాజీ మంత్రి తెన్నేటి విశ్వనాథంకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి వై.వరలక్ష్మి ఘన నివాళులర్పించారు. తెన్నేటి 130వ జయంతి సందర్భంగా ఉక్కునగరంలోని తెన్నేటి పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంజలిఘటించారు. ఆమె మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఉద్యమంలో రాజకీయ ఐక్యత తీసుకు రావడంలో తెన్నేటి ప్రముఖ పాత్ర పోషించారని కొనియాడారు. మంత్రిగా జమిందారీ చట్టం, భూసంస్కరణల చట్టంలో కీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో సాహితి, సౌమ్య, కె. వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తి.. పర్యావరణ దీప్తి



నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందిస్తున్న గుదే సుశీలా గజేంద్రరావు తదితరులు(ఫైల్)

అగనంపూడి: ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని మింగేస్తోంది.. వాయు కాలుష్యం ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తుంది.. మరోపక్క నీటి కాలుష్యం భూగర్భ జలాలను కలుషితం చేస్తోంది... ఇవి ఇప్పుడు వినిపిస్తున్న హెచ్చరికలు.. వాటికి చెక్ పెట్టాలంటే ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పాలి.. చెట్లను విరివిగా పెంచాలి... పాలకులు చేస్తున్న ప్రచారం.. ఆచరిస్తున్న వారు మాత్రం అరుదే... అయితే ఓ పర్యావరణ ప్రేమికుడు మాత్రం తనదైన శైలిలో కాలుష్య నియంత్రణకు.. ప్లాస్టిక్ భూతం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నాడు.. సేవా కార్యక్రమాలు కూడా చేపడుతూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. అతనే సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్, విశాఖ ఉక్కు విశ్రాంత అధికారి గుదే సుశీలా గజేంద్రరావు.

15 ఏళ్లుగా సామాజిక, సేవా కార్యక్రమాలు | ట్రస్ట్ ద్వారా సేవలు విస్తృతి | ప్రశంసలు అందుకుంటున్న గజేంద్రరావు



గతంలో ఉద్యానవనం దుస్థితి



ఉద్యానవనంలో చెత్తాచెదారం తొలగించిన తరువాత ఇలా...

పార్కుకు జీవం

జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన పార్కును సొంత నిధులు ఖర్చు చేసి శుభ్రం చేయించారు. స్థానికులు, విద్యార్థుల సహకారంతో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టి సుందరంగా తీర్చిదిద్దారు. సంక్రాంతితోపాటు అన్ని రకాల పండగలు ఇక్కడే నిర్వహించుకునేవారు. పిల్లలు ఆడుకోడానికి చక్కటి వేదిక దొరికిందని సంబరపడ్డారు. అయితే ఆయన చేస్తున్న కార్యక్రమానికి కొంతమంది అడ్డుతగలడంతో దానికి స్వస్తి పలికారు. ప్రస్తుతం వీలున్నప్పుడు చిన్న పిల్లలతో కలిసి స్వచ్ఛత కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ప్లాస్టిక్‌పై పోరు

దాదాపు 15 ఏళ్ల నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులు, వస్తువులను వాడడం మానేశారు. ఆయన కూరగాయలు, పండ్లు, కిరాణా సామగ్రి దుకాణాల నుంచి సరకులు తెచ్చుకోడానికి నార పంచులు, క్లాత్ సంచులనే వినియోగిస్తున్నారు. మాంసం, చికెన్, చేపలు, టిఫిన్లు, ఫలహారాలకు స్టీల్‌బాక్స్‌లను మాత్రమే ఉపయోగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగించే దుకాణదారులు, వినయోగదారులకు ప్లాస్టిక్ వల్ల జరబోయే అనర్థాలు వివరిస్తున్నారు.

మొక్కలు నాటుతూ...

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుతూ విస్తృత అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పనిచేసిన రెండేళ్లు మొక్కలు నాటడం, నార, క్లాత్ బ్యాగ్‌లు ఉచితంగా పంచుతూ ప్లాస్టిక్‌పై సమరం చేశారు.



ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గుదే సుశీల గజేంద్రరావు

భావి తరాలను దృష్టిలో పెట్టుకొని...



భవిష్యత్ తరాలు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఆస్వాదించాలనే లక్ష్యంతో ప్లాస్టిక్ అనర్థాలపై నావంతు ప్రచారం చేస్తున్నాను. ముందుగా నేను ఆచరిస్తూ ఇతరుల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాను. ప్రమాదమని తెలిసినా కూడా వ్యాపారులు, కొనుగోలుదారులు ప్లాస్టిక్ పంచులు, వస్తువులనే వినియోగిస్తున్నారు. మానవాళి ప్రాణాలను హరించే ప్లాస్టిక్ సంచుల తయారీ కంపెనీలను మూసివేస్తే భవిష్యత్ ఆశాజనకంగా ఉంటుంది.
– గుదే సుశీలా గజేంద్రరావు, ప్రజా సంఘం నాయకుడు



బతుకమ్మ వేడుకలు ప్రారంభం



బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ మహిళలు

ఉక్కునగరం: తెలంగాణ ప్రజలకు ముఖ్య పండగైన బతుకమ్మ సంబరాలు ఉక్కునగరంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో ఉద్యోగులు, తమ కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడిపారు. మహిళలు, పిల్లలు ఆటపాటలతో అలరించారు. సంఘం ముఖ్య సలహాదారు ఎన్. వీరేశం, అధ్యక్షుడు ఎస్. కుమారస్వామి, ప్రధానకార్యదర్శి జి. ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. వెంకటేశ్వర్లు, ప్రతినిధులు ఎస్. నర్సింగరావు, జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌లో డీపాల్ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

ఉక్కునగరం: జాతీయ లాన్ టెన్నిస్ పోటీల్లో ఉక్కునగరం డీపాల్ విద్యార్థినులకు పతకాల లభించాయి. కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ (ఐసీఎస్‌ఈ) ఆధ్వర్యంలో ఇటీవల కోయంబత్తూర్‌లోని పొలాచ్చీలో జాతీయ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న డీపాల్‌కు చెందిన జి. కావ్య , జి. సుదీక్షలు అండర్ 14 బాలికల విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపాల్ ఫాదర్ అనీస్ మాథ్యూ, వైస్ ప్రిన్సిపాల్ల ఫాదర్ షాజీ, ఫాదర్ ప్రవీణ్‌లు అభినందించారు.

అగ్రశ్రేణి శాస్త్రవేత్తల జాబితాలో క్రాంతికుమార్



క్రాంతికుమార్

అగనంపూడి: ప్రపంచ ప్రసిద్ధి చెందిన స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రకటించిన అత్యుత్తమ శాస్త్రవేత్తల జాబితాలో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆర్ అండ్ డీ విభాగం డీన్ క్రాంతి కుమార్ గంగూకు స్థానం దక్కింది. ప్రపంచ అగ్రశ్రేణి రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాను వరుసగా 2024, 25 సంవత్సరాలకు స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రకటించింది. ఈ రెండు జాబితాల్లో క్రాంతి కుమార్ చోటు దక్కడంపై విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు సంతోషం వ్యక్తం చేశారు. క్రాంతికుమార్ పరిశోధనలు, రచనలు, ఆవిష్కరణలు వివిధ ప్రపంచ స్థాయి పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈ మేరకు యూనివర్సిటీ ఆయన సేవలను గుర్తించి ఉత్తమ శాస్త్రవేత్తల జాబితాలో పొందుపర్చినట్టు వారు తెలిపారు.

బడ్డీలు తొలగించడం అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

గాజువాక: రోడ్డుపక్కన వ్యాపారాలు చేసుకుంటున్న స్ట్రీట్ వెండర్స్, తోపుడు బళ్ల వ్యాపారులను ఎలాంటి నోటీసు లేకుండా తొలగించడం అన్యాయమని గాజువాక హాకర్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కసిరెడ్డి సత్యానారాయణ అన్నారు. బడ్డీల తొలగింపును నిరసిస్తూ గాజువాకలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు, జీవీఎంసీ ఆదేశాల పేరుతో తోపుడు బళ్లను, చిరు వ్యాపారులను బుల్డోజర్, జేసీబీలతో అక్రమంగా తొలగించడం అమానుషమన్నారు. వీధి విక్రయదారుల క్రమబద్ధీకరణ చట్టాన్ని అధికారులు ఉల్లంఘించడం దారుణమన్నారు. అధికారులు స్పందించి అవే స్థలాల్లో వ్యాపారాలు చేసుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు పప్పు అప్పారావు, మత్తు అప్పారావు, ఎస్.మోహన్, అగనంపూడి శ్రీను, ఎస్.రమణ, గుంటూరు రాజు, లక్ష్మీ, కె.వనజాక్షి, జి.ఆనంద్, కె.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి



నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గాజువాక: సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన గీతాలతో విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. జేవీవీ జిల్లా కార్యదర్శి ఎస్‌వీకే పరశురామ్ మాట్లాడుతూ వివిధ కులాలు, జాతులు అన్నదమ్ములమాదిరిగా కలిసి మెలగాలని గురజాడ చాటి చెప్పారన్నారు. కానీ ప్రస్తుత పాలకులు కులమత వైషమ్యాలతో ప్రజలను విడగొడుతున్నారన్నారు. భారతీయులందరూ కలిసి జీవించడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో జేవీవీ కమిటీల ప్రతినిధులు లక్ష్మణస్వామి, ఎం.సింహాచలం, కె.వి. సత్యనారాయణ, రంగనాథ్, వాసుదేవరావు, లక్ష్మణరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆక్రమణల తొలగింపు



ప్రధాన రహదారిపై ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం: ఆక్రమణల తొలగింపు కార్యక్రమం రెండో రోజు ఆదివారం కూడా కొనసాగింది. వడ్లపూడి మెయిన్ రోడ్డుతో పాటు సంతతోట ప్రాంతంలో రహదారులపై ఉన్న బడ్డీలతో పాటు కాలువలపై వేసిన పలకలను అధికారులు తొలగించారు. వాణిజ్య సముదాయాల ముందు రేకులతో వేసిన షెడ్లలను సైతం సిబ్బంది కూల్చేశారు. గాజువాక జోన్ ప్రణాళిక విభాగం అధికారులు, ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు తదితరులు తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

తొలగింపులో పక్షపాతం !

అయితే ఆక్రమణలు తొలగింపులో సిబ్బంది కొంత పక్షపాతం చూపారన్న ఆరోపణలు వినిపించాయి. కొంతమంది షాపులు ముందు కేవలం మెట్లు మాత్రమే తొలగించారు. మిగిలిన వారి విషయంలో నిబంధనలు అంటూ ప్లాక్లెయిన్‌తో మెట్లు , అరుగులు తొలగించారని పలువురు పేర్కొన్నారు. ఇదేమని అడిగితే ఆయా షాపుల యజమానులు తమకు తాము తొలగించుకుంటామంటే సమయం ఇచ్చామని అధికారులు చెబుతున్నారు. మిగిలినవి కూడా తొలగించేస్తామని అధికారులు పేర్కొన్నారు.

అభ్యంతరాలు

కాగా రాజకీయపార్టీల నుంచి కూల్చివేతలపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కూల్చివేతలు పేదలపై దాడిలా మారాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపు రాము పేర్కొన్నారు. రోడ్ల పక్కన వ్యాపారం చేసుకొంటూ ఎంతోమంది జీవనం సాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కూల్చివేతలు వల్ల వారి జీవనోపాధి పూర్తిగా పోయిందని రాము ఆవేదన వ్యక్తం చేశారు. తోపుడుబళ్లు , ఇతర చిరు వ్యాపారుల బడ్డీలు కూల్చివేయడం దుర్మార్గమన్నారు. చిరువ్యాపారులందరికీ ప్రత్యామ్నాయం చూపాలని రాము డిమాండ్ చేశారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్యులను సత్కరిస్తున్న మద్దాల అప్పారావు తదితరులు

పెదగంట్యాడ: గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో మెడికవర్, ఎంకే డెంటల్ కేర్ సహకారంతో 65వ వార్డు గౌరీ సేవా సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 200 మందిని వైద్యులు పరీక్షించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమాన్ని 65వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు ప్రారంభించారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం ప్రతినిధులు దాడి వేణు, సారధి, మల్లేష్, రమణబాబు, పెద్ద సూరిబాబు, చిన్న సూరిబాబు, పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు

ఆలయాలకు శరన్నవరాత్రి శోభ

నేటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం



విద్యుత్ కాంతుల్లో బర్మా కాలనీ దుర్గాదేవి ఆలయం



ముస్తాబైన కన్యకా పరమేశ్వరి



ఆహ్వాన పత్రాలను విడుదల చేసిన ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: దసరా ఉత్సవాల సందడి మొదలైంది. పూజల కోసం అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్‌బోర్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కన్యకా పంచయాతన ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఆవరణలో ఉత్సవ కమిటీ సభ్యులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కొల్లా అప్పలరాజు, మెగలపల్లి త్రిమూర్తులు, బొండాడ వెంకటేశ్వరరావు, బిట్టూరి వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. 22న బాలత్రిపుర సుందరి హోమం, 23న గాయత్రీ హోమం, 24న అన్నపూర్ణదేవి హోమం, 25న కాత్యాయిని దేవి హోమం, 26న మహాలక్ష్మి దేవి హోమం, 27న లలిత త్రిపుర సుందరీదేవి హోమం, 28న మహాచండి హోమం, 29న సరస్వతీ పూజ, 30న దుర్గాదేవి హోమం, వచ్చేనెల 1న మహిషాసురమర్దిని హోమం, 2న రాజరాజేశ్వరి దేవి హోమం నిర్వహిస్తామని తెలిపారు.

బర్మాకాలనీ ఆలయంలో..

బర్మా కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ఆలయంలో దసరా వేడుకలు అట్టహాసంగా నిర్వహించనున్నారు. దుర్గాదేవి భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ప్రతి రోజూ విశేషంగా అలంకరణలు హోమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సొసైటీ సభ్యులకు తక్కువ వడ్డీకే రుణాలు



వార్షిక నివేదికను ప్రకటిస్తున్న కార్యదర్శి వెంకటరాజు

గాజువాక: బీహెచ్‌ఈఎల్–హెచ్‌పీవీపీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఈ ఏడాది రూ.6,85,738 వార్షిక లాభాన్ని ఆర్జించిందని సంఘం కార్యదర్శి మండ వెంకటరాజు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సంఘం మహాజన సభలో ఆయన వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. సభ్యులకిచ్చే రుణాలపై వడ్డీని 14 శాతం నుంచి 12 శాతానికి తగ్గించామని తెలిపారు. పొదుపు ధనంపై 8 శాతం వడ్డీని ఈనెల 25న సభ్యులకు జమ చేయనున్నట్టు పేర్కొన్నారు. సభ్యులకు అవసరమైనప్పుడు రుణ సదుపాయాన్ని సత్వరమే అందిస్తున్నామన్నారు. సంఘం నిర్వహిస్తున్న లావాదేవీలను, పరిపాలనాపరమైన అంశాలను బోర్డు డైరెక్టర్లతో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సొసైటీని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. అనంతరం సంఘం 2025–26 బడ్జెట్‌ను సంఘం డైరెక్టర్ జి.టి.పి.ప్రకాష్ ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సంఘం ఉపాధ్యక్షుడు కె.ధర్మారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డైరెక్టర్లు జి.ప్రసాద్, కె.ఎస్.వి.ప్రసాద్, ఎస్.బి.ప్రశాంత్ కుమార్, మేనేజర్ వెంకట రమణారావు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతలపూడి వెంకటరామయ్యను సత్కరిస్తున్న 87వ వార్డు నాయకులు

కూర్మన్నపాలెం: కష్టపడి పని చేస్తే ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య అన్నారు.వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన చింతలపూడిని ఆదివారం ఆపార్టీ 87వ వార్డు నాయకులు కలిసి సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అండగా ఉంటూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపురాము, ప్రగడవేణు, కర్ణం లక్ష్మి, అంజయ్య, అప్పలనాయుడు, సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

